క్లుప్తంగా

పెద్దాస్పత్రి కార్మికుల సమ్మె విరమణ

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని పెద్దాస్పత్రి కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం విరమించారు. మూడు నెలల పెండింగ్ వేతనం చెల్లించాలని సోమవారం కార్మికులు సమ్మెకు దిగిన విషయం విదితమే. సమ్మె కారణంగా ఆస్పత్రిలో ఎక్కడ వ్యర్థాలు అక్కడే పేరుకుపోయి రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు అధికారులు నచ్చజెప్పడంతో వారు సమ్మె విరమించి విధుల్లో చేరారు. ఒక నెల జీతం చెల్లించగా, రెండు నెలల జీతం పది రోజుల్లో అకౌంట్‌లో జమ చేస్తామనే హామీతో వారు సమ్మెను విరమించారు.

బాధ్యతల స్వీకరణ



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ముఖ్య పరిపాలనాధికారులు

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారిగా సంజయ్ శేత్కర్, కుటుంబ న్యాయస్థానం ముఖ్య పరిపాలనాధికారిగా ఇ.గోపాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంజయ్ శేత్కర్ కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో పనిచేస్తూ ఖమ్మంకు బదిలీ కాగా గోపాలకృష్ణ రంగారెడ్డి జిల్లా కోర్టులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. వీరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయండి

ఖమ్మంలీగల్: మంచిర్యాలలో ఈనెల 10, 11వ తేదీల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యాన నిర్వహించే రాష్ట్రస్థాయి వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఐలు ఖమ్మం జిల్లా కమిటీ ఒక ప్రకటనలో కోరింది. ఈ శిక్షణలో న్యాయవాదులకు ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్, క్రాస్ ఎగ్జామినేషన్ - మెడికల్ ఎవిడెన్స్, ప్లీడింగ్ అండ్ డ్రాఫ్టింగ్స్, న్యాయవాదుల ముందున్న సవాళ్లు, లా ఆఫ్ ఎగ్జిక్యూషన్, నూతన చట్టాలపై అవగాహన తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు కమిటీ బాధ్యులు పేర్కొన్నారు.

ఇంటింటి సర్వే ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బుధవారం ఇంటింటి సర్వే ప్రారంభించారు. నగరంలోని నయాబజార్ పాఠశాల హెచ్‌ఎం సుధ ఆధ్వర్యాన సిబ్బంది స్థానికంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇంటింటి సర్వే చేసి సమగ్ర వివరాలు సేకరించారు.

భర్తతో గొడవ..

- బైక్ నుంచి దూకిన మహిళ

నేలకొండపల్లి: దంపతుల నడుమ ఘర్షణతో బైక్ పైనుంచి దూకిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ముదిగొండ మండలం గంధసిరికి చెందిన దంపతులు బైక్‌పై బుధవారం నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామానికి వెళ్తున్నారు. కొత్తకొత్తూరు సమీపాన వీరిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో మహిళ బైక్ పైనుంచి దూకగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెకు నేలకొండపల్లి చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	రెట్రో, జింకానా
సాయిరాం	తండర్‌బోల్ట్స్
ఆదిత్య	జింకానా, అర్జున్ వైజయంతి
శ్రీనివాస	హిట్: ది థర్డ్ కేస్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	26		20
కాకర	56	చుక్కకూర	3
బీట్‌రూట్	30		20
బీర	50	తోటకూర	4
దొండ	20		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	96		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	30		20
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం

- ఆయిల్‌పామ్ సాగుతో రైతుల అభ్యున్నతి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో బుధవారం పర్యటించిన ఆయన రూ.30 లక్షలతో నిర్మించే పీఏసీఎస్ భవనం, రూ.2.33 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీఆర్‌ఆర్ నిధులు రూ.కోటితో రహదారి, ఎస్సీ కాలనీలో రూ.1.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే రహదారుల సాధ్యమవుతుందని తెలిపారు. అమరావతి -నాగపూర్ జాతీయ రహదారి సిద్ధమవుతోందని, ఇందుకోసం భూములు ఇచ్చిన రైతులకు కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఎకరాకు రూ.35 లక్షల పరిహారం ఇప్పించానని చెప్పారు. అలాగే, యంగ్ ఇండియా సమీకృత గురుకులం, వైద్య కళాశాల, స్వామి నారాయణ సంస్థ విద్యాసంస్థలు రానున్నాయని, ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగర్ జలాలు చేరుతున్నాయని తెలిపారు. కాగా, రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, తద్వారా నష్టాలు తగ్గి అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం మత్స్యకార మహిళా సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ జి.నర్సింహారావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకుబ్, మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ పుష్పలతతో పాటు మానుకొండ రాధాకిషోర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తాతా రఘురాం, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, గుడిపుడి రామారావు, రెంటాల ప్రసాద్, వాంకుడోత్ దీపక్, మందా బుచ్చిబాబు, నందా పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే అవకాశాలు..

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ కోసం పనిచేస్తూ, పార్టీని అధికారంలోకి రావడానికి పాటుపడిన నాయకులు, కార్యకర్తలు అవకాశాలు లభిస్తాయని పీసీసీ పరిశీలకుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి అవకాశంవచ్చేలా పదవులు కేటాయిస్తామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పదవుల పంపిణీలో తానెప్పుడూ జోక్యం చేసుకోనని, కష్టమే ప్రాతిపదికన పదవులు వస్తాయన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు, ప్రజాప్రతినిధులు బత్తిని శ్రీనివాసరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావెద్, ఫాతిమా జోహరా, బాలగంగాధర తిలక్, మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషిచేసిన పార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్‌కు పదవి ఇవ్వకపోగా, కనీసం మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని మైనార్టీ నాయకులు సమావేశంలో ఆందోళనకు దిగారు. అందరం కష్టపడి గెలిపించిన మంత్రి తుమ్మల ఈ విషయంలో స్పందించాలని నాయకుడు చోటేబాబా తదితరులు పేర్కొన్నారు.

ప్రజా అవసరాల మేరకే రోడ్ల విస్తరణ



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల అవసరాల మేరకు, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు నగరంలో రోడ్ల విస్తరణ పనులు చేపడతామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. బుధవారం నగరంలోని కస్బాబజార్, కమాన్‌బజార్, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో ఆయన ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడగా.. రోడ్లు ఇరుకుగా ఉండడం వలన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పాత మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డును విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఇక వర్షాకాలంలో వరద నీరు రోడ్లపైకి చేరకుండా కాల్వల్లో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రెయినేజీలను శుభ్రం చేయాలని, అవసరమైన చోట కొత్త డ్రెయినేజీలు నిర్మించాలని ఆదేశించారు.

నీటి వనరుల పరిరక్షణకు సర్వే..



సర్వే చేస్తున్న అధికారుల బృందం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, వాగులు, నీటి నిల్వ ప్రాంతాలన్నింటినీ మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌లో చేర్చేందుకు అధికారులు ప్రత్యేక ఏజెన్సీ ద్వారా సర్వే చేపట్టారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యాన జరుగుతున్న ఈ సర్వేలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వాగులు, చెరువులు ఎన్ని? వాటి విస్తీర్ణం ఎంత? తదితర సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా భవిష్యత్‌లో నీటి వనరుల పరిరక్షణకు తగిన ప్రణాళికలు రూపొందించి ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతులు జారీ చేసే అవకాశం ఉంటుంది. బుధవారం చెరువు బజార్‌లోని వాగు ప్రాంతంలో రెవెన్యూ సర్వే అధికారి నాగేశ్వరరావు, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ ఉదయ్ ప్రతాప్, ఏఈ రాజేష్‌రావు తదితరులు పర్యటించి సర్వే చేపట్టారు. ఇప్పటికే డొంకలను ప్లాన్‌లో చేర్చామని, వాటితో పాటు రోడ్ల విస్తరణ తదితర వాటిని సైతం ప్లాన్‌లో నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలని వినతి



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులతో పాటు కార్మికులకు, ఆర్టిజన్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని టీజీయూఈఈయూ(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి ఎస్ఈ శ్రీనివాసాచారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో పనిభారానికి అనుగుణంగా నియామకాలు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పెన్షన్ సౌకర్యంతో పాటు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల కోసం పోరాడి మరణించిన యూనియన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కిరణ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు, గంట శ్రీనివాస రావు, ఎల్వీ కృష్ణారావు, ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

రైతు, కూలీలను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య

తిరుమలాయపాలెం: అకాల వర్షాలు, గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతాంగంతో పాటు వ్యవసాయ కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు ఈ ప్రభుత్వం సరైన వేతనం చెల్లించకపోవడం వలన ఇతర రాష్ట్రాలకు వెళ్లి వెట్టి చాకిరీ చేసే పరిస్థితి నెలకొందని, ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఆదుకోవాలని అన్నారు. పార్టీ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులుగుజ్జు వెంకటస్వామి, ఆరెంపుల వెంకన్న, బానోతు శంకర్, నామ అప్పారావు, ఉన్నం నాగేశ్వరరావు, బండి వీరయ్య, గోకినపల్లి వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిషనా.. మజాకా!



రోడ్డును శుభ్రం చేస్తున్న స్వీపింగ్ మిషన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో రహదారుల శుభ్రతను మెరుగుపరిచేందుకు ఓ ఆధునిక మెకానైజ్డ్ స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేసి సేవలోకి తీసుకొచ్చారు. ఈ మిషన్ ద్వారా మానవీయ శ్రమను తగ్గించడంతో పాటు శుభ్రత పనులను వేగంగా, సమర్థవంతంగా రోజుకు సుమారు 60 కిలోమీటర్ల రహదారులను శుభ్రం చేయడం సాధ్యమవుతుంది. బుధవారం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బల్లేపల్లి స్టేజ్ వరకు ఈ మిషన్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ ట్రయల్ ద్వారా మిషన్ సామర్థ్యాన్ని పరిశీలించి, నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా దీన్ని అమలులోకి తీసుకురావాలని కమిషనర్ యోచిస్తున్నారు.

10 వరకు రుద్రాక్షల ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఓమ్‌శ్రీ నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను ఈ నెల 10 వరకు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన రుద్రాక్ష నిపుణుడు దుర్గాప్రసాద్ తెలిపారు. సాయంత్రం వేళల్లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల రుద్రాక్షలు, కరుంగాళి మాలలు, సాలిగ్రామాలు, దక్షిణావృతం శంకులు లభిస్తున్నాయని, గృహ, వాస్తు, జన్మరాశి, జన్మ నక్షత్రాన్ని అనుసరించి రుద్రాక్షల అందుబాటులో ఉన్నాయన్నారు.

నెల బాలుడికి బ్రెయిన్ సర్జరీ



చిన్నారి, తల్లిదండ్రులతో ఆస్పత్రి బృందం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని అంకుర ఆస్పత్రి వైద్యులు 30 రోజుల వయసు కలిగిన బాలుడికి బ్రెయిన్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ వివరాలను ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాకేష్ బుధవారం వెల్లడించారు. మధిరకు చెందిన దంపతులకు నెలలు నిండకుండానే బాలుడు జన్మించగా, బ్రెయిన్‌లో నరాలు చిట్లిపోయి రక్తస్రావమైంది. దీంతో సదరు బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో పలు ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఫలితం లేకపోగా హైదరాబాద్ లేదా విజయవాడ తీసుకెళ్లాలని సూచించారు. అంత స్థోమత లేకపోవడంతో దంపతులు ఖమ్మంలోని అంకుర ఆస్పత్రిలో సంప్రదించారు.ఈ మేరకు న్యూరో సర్జన్ జొన్నలగడ్డ వరుణ్ నేతృత్వాన వివిధ విభాగాల వైద్యులు ఎం.కోటేశ్వరరావు, జ్యోత్స్న, శ్వేత, అపర్ణ, రాకేష్, జాకీర్ తదితరులు మూడున్నర గంటల పాటు శ్రమించి బ్రెయిన్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. దీంతో చిన్నారి కోలుకోగా బుధవారం డిశ్చార్జి చేసినట్లు ఎండీ తెలిపారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం

కామేపల్లి: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని ఊట్కూర్‌లో ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యాన అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్వీ.రాకేశ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. విద్యార్థులు, యువకులు అల్లూరి అందించిన స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధి, ఉచిత విద్య, వైద్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాయి, రమేశ్, దాస్, రాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ, జీళ్లచెరువు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత పరిశీలించారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాకులు, ధాన్యం రవాణాకు లారీలను సమకూరుస్తామని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలన్నారు. తేమశాతం రాగానే ధాన్యం కాంటాలు వేయించి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వాణి, ఏఈఓ రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలు ఇంటికి మణిదీపాలు



జింకలతండాలో చిన్నారిని లాలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం: ఆడపిల్లలు ఇంటికి వెలుగునిచ్చే మణిదీపాలుగా నిలుస్తారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలంలోని జింకలతండాలో బుధవారం 'మా పాప-మా ఇంటి మణిదీపం'లో భాగంగా ఇటీవల ఆడబిడ్డకు జన్మనిచ్చిన బేగం - షరీఫ్ దంపతులను కలెక్టర్ సన్మానించారు. ఈసందర్భంగా పాపను లాలించిన ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నందున వారికి అన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. జిల్లా శిశు సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఆర్ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అదృష్టం..

ఆడపిల్లలు జన్మించడం అదృష్టంగా భావించాలని వారే ఇంటికి మణిదీపమని అధికారులు తెలిపారు. 'మా ఇంటి మణిదీపం'కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ గ్రామాల్లో పర్యటించి ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సన్మానించి, స్వీట్స్‌లతో పాటు ప్రశంసపత్రాలను అందించారు. ఆడపిల్లలను తల్లిదండ్రులు మగ పిల్లలతో సమానంగా పెంచాలని, వారికి సమాన హక్కులు కల్పించాలన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: బోడతండా వేడుకలో జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఐసీడీఎస్ అధికారులు



నేలకొండపల్లి: బుద్ధారంలో ప్రశంసాపత్రం అందిస్తున్న ఏసీడీపీఓ రత్నకుమారి



కూసుమంచి: వేడుకలో పాల్గొన్న జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీలత, సీడీపీఓ సిబ్బంది



కామేపల్లి: కొమ్మినేపల్లిలో లకావత్ అశోక్, రాధ దంపతులను సన్మానిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రావు, అధికారులు

విద్యార్థుల సంఖ్య పెంచేలా 'బడి బాట'

- పాలేరు సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా బడి బాట నిర్వహించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం పాలేరు నియోజకవర్గ పరిధి విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలతో సమావేశమైన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన విజయాలు, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవాలని, పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనుల నిర్వహణలో మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. డీఈఓ సత్యనారాయణ, సీఎంఓ రాజశేఖర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగించాల్సిందే..



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


నేలకొండపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించాక వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీఓ సీహెచ్. శివకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు కొనసాగించలేమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అసమర్థ పాలనకు నిదర్శమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోకుండా హామీలు ఎలా ఇచ్చారని ప్రశ్నించి, హామీలు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో లబ్ధిదారుల ఎంపికలో అనేక అవకతవకలు జరిగాయని, జాబితాను పంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, కూలీ సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బషీరుద్దీన్, గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, భూక్యా కృష్ణ, మారుతి కొండలరావు, కట్టికోల వెంకటేశ్వర్లు, దండా సూర్యానారాయణ, యలమద్ది లెనిన్, ఇంటూరి అశోక్, రాసాల నవీన్, బొడ్డు మధు, చింతలపాటి భాస్కర్, శీలం అప్పారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, సామాల మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు శాంతియుత పోరాటాలు

ఖమ్మం మామిళ్లగూడెం: ముస్లిం మైనార్టీలకు చెందిన వక్ఫ్ భూములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సొత్తు కాదని, వీటిని పరిరక్షించుకునేందుకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఒక దిక్సూచిగా నిలవబోతుందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ సాధిక్ అలీ అన్నారు. బుధవారం ఖమ్మంలో డాక్టర్ నజీరుద్దీన్ నివాసంలో నిర్వహించిన హజ్ యాత్రికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు రద్దుకు గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హజ్ యాత్రికుల పర్యవేక్షకులు జనాబ్ నవాలుద్దీన్, ముఫ్తీ సిజావుద్దీన్, డాక్టర్ నజీరుద్దీన్, దస్తగిరి, జనాబ్ హసన్, బాబు, సత్తార్, ముస్తఫా, జానిమియా, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

తాగునీరు వృథా..



మండలంలోని బీరోలు బంధంపల్లి మార్గం మధ్యలోని బ్రిడ్జి వద్ద బీరోలుకు తాగునీరు అందిస్తున్న మిషన్ భగీరథ పైపు పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. దీంతో సరిపడా నీరు అందక ఎస్సీ కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- తిరుమలాయపాలెం